# హేమంత పరాగం

సాయంత్రం ఏడు గంటలయింది.

ఆదినారాయణ ఇంకా ఆఫీసు నుంచి రాలేదు. అతను వచ్చి ఇవాళ ఆ వ్యవహారం ఎట్లా నడిచిందో చెబితేగాని తృప్తిగా విని నిద్రపోవటానికి లేదు రామనారాయణకు.

అంత పల్లెటూరు, పట్టణమూ కాని ఊరు.

ఇంకెవరన్నా అయితే 'సిటీ'కి మకాం మార్చేసేవాళ్ళే. రామనారాయణకు అలా చేయడం ఇష్టం కాదు. ముత్తాతల కాలం నుంచి కుటుంబ శ్రేయస్సు కాపాడుకుంటూ వస్తున్న ఇల్లు. అధునాతన పరికరాలు జోడించుకుంటే ఏ ఇల్లయినా ఎంతో అనుకూలంగా, స్వర్గతుల్యంగా తయారైపోతుంది.

"నా ఘటం తెల్లవారిన తరువాత కూడా ఈ మాట తలపెట్టకు. అవసరం అనుకుంటే సిటీలోనే, ఇంకో ఇల్లు కొనుక్కో. మనం కావలసిన తీరున కట్టు కుందాం. అంతేగాని, 'మకాం' అంతా అక్కడకు మార్చేయాలని చూడకు" అన్నాడు రామనారాయణ కొడుకుతో.

ఆదినారాయణ ఇంకేం చేయడానికి లేకుండా పోయింది. ఊరికి పదిహేను కిలోమీటర్ల దూరంలో జిల్లా కేంద్రం.

కుర్రవాళ్ళ చదువులకూ, వ్యాపారానికీ అనుకూలంగా ఉంటుందని 'ఆఫీసు' ప్రారంభించాడు ఆదినారాయణ అక్కడ. రోజూ తొమ్మిది గంటలకల్లా ఇంటి దగ్గర లఘుభోజనం ముగించేసుకుని, మోటార్ సైకిల్ మీద అక్కడకు వెళ్ళి పోతాడు. సాయంత్రం పనిని బట్టి, ఏడు గంటలకు, ఎనిమిది గంటలకు మళ్ళీ ఇంటికి చేరుకుంటాడు. మధ్యాహ్నం భోజనం, విశ్రాంతి... తతిమ్మా అవసరా లన్నీ అక్కడ ఎంత అనుకూలంగా జరుగుతున్నాయి ఈ ఏర్పాటు ఆరోగ్యానికి మంచిదేనా అన్న ప్రశ్న లేదు రామనారాయణకు. ఆయనకు కావలసిందల్లా ఇల్లు ఈ పల్లెటూరు నుంచి కదలిపోకుండా ఉండడమే.

ఆదినారాయణ బాగా చదువుకున్నాడు. పదిమందితో తిరగడానికీ, వ్యవహారం చేయడానికి వ్యాపారం చూసుకోడానికి, ఆ చదువు చాలు.

"చదువుకుంటే, చదువుకున్నావు. నువ్వు మాత్రం ఉద్యోగాలు చేస్తాను, ఊళ్ళేలతాను - అని దేశాల మీద తిరుగతానంటే కుదరదు. లక్షణంగా మన ఫైనాన్స్ కార్పొరేషన్ పనులు చూసుకో. నీ మనసుకు నచ్చినట్లయితే నాలుగు పరిశ్రమలు ప్రారంభించు. వందలు వేలు కుటుంబాలకు జీవనోపాధి కల్పించు. నువ్వు బాగుపడు, పదిమందినీ ఉత్తీర్ణులను చేయి..." అని ఆదేశించాడు తండ్రి.

ఆదినారాయణకు మాత్రం ముందు పది పదిహేను సంవత్సరాల పాటు ఏదయినా పెద్ద ఉద్యోగమో, వ్యాపారమో స్వతంత్రంగా చేసి తర్వాత కుటుంబ వ్యాపారాల పరిపాలన చేయాలనే ఉండేది. దీనివల్ల అతనికి సదుపాయం అనిపించింది ఏమిటంటే - మనకేమీ 'రిస్క్' లేకుండా బోలెడంత వ్యాపారానుభవం వస్తుంది. అదృష్టం బాగుంటే అందులోనూ కొన్ని లక్షలు వెనుక వేసుకుని కూర్చోవచ్చు. దాన్ని కుటుంబ వ్యాపారంతో మిళితం చేసుకోవచ్చును తరువాత.

వ్యాపారంలో బోలెడంత స్వేచ్ఛ ఇచ్చాడు రామనారాయణ. ప్రతి పనీ ఇలా చేయి, అలా చేయి అని హుకుములు జారీ చేయడు. "నీవు బాగా ఆలోచించు. బుద్ధికి లక్షణం అన్నట్లుగా చేయి. ఎవరి స్వబుద్ధి మీద వాళ్ళు నిలబడి కార్యాచరణ చేయాలని భగవద్గీత కూడా చెబుతుంది" అంటాడు అతి తరుచుగా. ఇలా అన్నాడు గదా అని ఆదినారాయణ తన ఇష్టం వచ్చినట్లు చేయడు. వ్యాపారంలోంచి 'రిటైర్' అయిపోయినాడు గదా, ఇంకా ఆయనను ఆ వివరాలతో ఎందుకు విసిగించాలి అనుకోకుండా రోజూ తాను చేస్తున్న పనులు, వాటి పర్యవసానాలు, వాటి నుంచి నేర్చుకోవలసిన - నేర్చుకుంటున్న - కొత్త కొత్త పాఠాలు ఇవన్నీ తండ్రి ముందు ఏకరువు పెడతాడు. ఏవైనా అతి ముఖ్యవిషయాలు అనుకుంటే తండ్రిని సంప్రదించి ఆ పైననే అమలు జరుపుతాడు.

"ఎందుకురా మీ నాన్నను ఇంకా ఇబ్బంది పెడతావు? నీ ఇష్టం వచ్చినట్లు చేసుకోమని నీకు ఎన్నడో చెప్పివేశాడు గద!" అంటుంది తల్లి జోగులాంబ.

"అలా అనకు. నాన్న అనుభవం, వ్యాపార దృష్టి, ముందు చూపు... ఎంత నేర్చుకుంటే నాకు వస్తుంది!" అంటాడు ఆదినారాయణ.

రామానారాయణ పిసినారి కాదు. ఇతరులకు ఏమీ తెలియదు, అన్ని సంగతులూ నాకే కూలంకషంగా తెలుసును - అన్న దురహంభావం అసలే లేదు. లోతుగా ఆలోచించి, ప్రతీదీ ప్రగాఢంగా చింతన చేయాలి. ఇదే ఆయన

సిద్ధాంతం.

జోగులాంబ గదిలోనికి వచ్చి "ఇంకా అబ్బాయి రాలేదు. పోనీ మీరు నిద్ర వస్తే పడుకోండి" అంది.

"నిద్ర రావడంలేదు. అయినా అబ్బాయితో ఇప్పుడు మాట్లాడవలసిన విషయం కూడా ముఖ్యమయినది ఉంది" అన్నాడు రామనారాయణ.

"వచ్చేస్తూనే ఉంటాడు. అంత ముఖ్యమయినదా!"

"అవును. గోపాలరావుగారి అబ్బాయి మనవాడికి క్లాస్‌మేట్ గదా?" అనడిగాడు ఆమెను.

"ఏ అబ్బాయి?"

"అదే నాలుగోవాడు. వాడి పేరు సుందరేశ్వరరావో, ఏదో ఉండాలి."

"అవును. సుందరం అంటారు అందరూ. అంత పొడుగు పేరు నోరు తిరగడం కష్టం అని."

"ఆ సుందరం సంగతే నేను అడిగేది."

"అవును. సుందరమూ, మన ఆది నాలుగేళ్ళపాటు కలసి చదువుకున్నారు. కలసి మెలసి తిరుగుతూ ఉండేవాళ్ళు అప్పుడు."

"ఇప్పుడూ కలిసే తిరుగుతున్నాడు."

"ఆ అబ్బాయి ఎక్కడో బొంబాయిలో ఉన్నాడు గదూ!"

"ఉండేవాడు. ఓ సంవత్సరం క్రితం ఇక్కడకు వచ్చేశాడు. పట్టణంలో ఏదో పరిశ్రమ ప్రారంభించాడట."

"అలాగా! నాకు తెలియనే తెలియదు. వాళ్ళ కుటుంబం ఇక్కడి నుంచి వెళ్ళిపోయిన తరువాత మళ్ళీ నేను వాళ్ళను గురించి విననే లేదు."

గోపాలరావు కుటుంబం కూడా ఈ పల్లెటూరుకు చెందిందే. కాకపోతే వాళ్లు చాలా సంవత్సరాలై సిటీకి తరలి వెళ్ళిపోయారు. ఈ ఊళ్ళో ఉన్న ఆస్తిపాస్తులన్నీ నామమాత్రంగా అజమాయిషీ చేసుకుంటూ దూర దూరంగానే ఉండిపోయారు.

రామనారాయణకు పరిచయం అయినవాళ్ళే. అయితే అంత సన్నిహితం అయిన కుటుంబం కాదు. కాకపోవడానికి కూడా పెద్ద కారణాలేవీ లేవు. వాళ్ళది పై అంతస్తు. తమది ఓ చాయ తక్కువ. ఆర్థిక వ్యత్యాసాలు పైకి స్పష్టంగా తెలిసినవే అయినా, మనసును తొలిచివేసే ఉదంతం మరొకటి.

జోగులాంబను తనకు ఇవ్వడానికి వచ్చినప్పుడు, ఆమె తండ్రి తననూ, గోపాలరావునూ బేరీజు వేసి చూశాడు. ఆడపిల్లను ఒక ఇంటికి ఇవ్వదలచుకున్నప్పుడు ఎన్నో సంగతులు విచారిస్తారు. ఆస్తిపాస్తులు, అందచందాలు, కుటుంబ పరిస్థితులు, ఈడుజోడు, మనస్తత్వాల కలయిక... ఇలా ఎన్నో ఎన్నో. ఇవన్నీ సరిపోయాయి అనుకున్న తర్వాతనే ఇలాంటివి రెండు మూడు సంబంధాలు కనిపించినప్పుడు, వాటిని బేరీజువేసుకుని ఒక నిర్ణయానికి వస్తారు.

రామనారాయణ, గోపాలరావుల విషయంలో కూడా ఇలాగే జరిగింది. జోగులాంబ తండ్రిని గోపాలరావు తండ్రి అంతకుముందు నుంచే ఎరుగును. మధ్యవర్తులు కూడా ముందు గోపాలరావునే సూచించారు, ఆయన అమ్మాయి వివాహ ప్రసక్తి తీసుకువచ్చినప్పుడు. కాకపోతే ఆయన ఎలా బేరీజు వేసుకున్నాడో, ఏమేం లెక్కలు కట్టుకున్నారో తెలియదు గాని చివరకు రామనారాయణనే అల్లుడిని చేసుకునేందుకు నిర్ణయించుకున్నాడు.

జోగులాంబను చేసుకున్నందుకు ఎప్పుడూ పరితాపపడవలసిన అవసరం రాలేదు రామనారాయణకు. కాని దాని కోసం ఎన్నో 'ఎడ్జస్ట్‌మెంట్స్' చేసుకోవలసి వచ్చింది అతను. 'రామనారాయణను కాకుండా గోపాలరావును చేసుకుంటే నేను సుఖంగా ఉండేదాన్ని' - అన్న అభిప్రాయం జోగులాంబకు ఎక్కడ కలుగుతోందో అని రామనారాయణ మొదట్లో దాదాపు పది సంవత్సరాల పాటు తన వివాహ జీవితాన్ని క్షణ క్షణమూ ఊహాపోహలతో సరిపోల్చుకుంటూ గడిపి వేయవలసి వచ్చింది. అలాగే జోగులాంబ తండ్రికి - అంటే తన మామగారికి చూఛాయగానైనా 'భావన' రాకుండా ఉండడం కోసం గూడా ఎన్నో పనులు, తనకు అంత సుకరమైనవి కాకపోయినా, చేయవలసి వచ్చింది.

గోపాలరావు కుటుంబం ఎంతో దూరంలో ఉండిపోయినా వాళ్ళతో సరిపోల్చి చూసుకోవడం, ఎప్పుడూ ఆ పరిస్థితులు తలుచుకుంటూ ఉండటం.

అయితే ఇవన్నీ జోగులాంబ ఊహల్లో ఎలా ఉన్నాయో, ఎప్పుడూ తెలుకునేందుకు ఉత్సాహం చూపలేదు అతను. ఇలాంటి విషయాలు ఎంత తక్కువగా మనసుకు తెచ్చుకుంటే అంత మంచిది, ఇద్దరికీని. తను అసూయతో వేగిపోతున్నట్లు తెలిస్తే జోగులాంబ తనను గురించి ఏమనుకుంటుంది?

తరువాతి రోజుల్లో గోపాలరావు తన కూతుర్ని ఆదినారాయణకు 'ఆఫర్' చేస్తాడేమోనని ఆశించాడు రామనారాయణ. కాని ఆయన ఇలాంటి ప్రసక్తే ఈ ప్రపంచంలో లేదన్నట్లుగా అమ్మాయిని ఇంకెవరికో కట్టబెట్టాడు. ఆదినారాయణ వాళ్ళ అబ్బాయితో కలిసిమెలిసి తిరుగుతూ ఉండేవాడు గనుక --

అట్లా అనిపించింది నాకు, అంతేగాని గోపాలరావుతో వియ్యం అందుకోవాలని మనసేం లేదు – అని సమాధానం చెప్పుకున్నాడు తనకు తానే రామనారాయణ.

"ఇప్పుడు ఆ సుందరం ప్రసక్తి ఏం వచ్చింది?" అని అడిగింది జోగులాంబ.

"మన ఆదిని తన ఇండస్ట్రీలో భాగస్వామిగా కలుపుకుందామని ప్లాన్ చేస్తున్నాడు అతడు--" అన్నాడు రామనారాయణ పొడిగా.

"మీరేం సలహా చెప్పారు?"

"మామూలే"

"అంటే?"

"బాగా ఆలోచించుకుని నిర్ణయం తీసుకోమని--"

"సరే. అలాగే చేస్తాడుగా అబ్బాయి"

"అవును. చేస్తాడు. కాని... ఏం నిర్ణయం తీసుకున్నాడో తెలుసుకోవాలని, నాకు ఆదుర్దాగా ఉంది."

"అబ్బాయి మీతో చెప్పే చేస్తాడుగా!"

"అవును. ఇవాళ సాయంత్రం ఈ విషయం నిర్ణయం తీసుకుంటాడనుకుంటాను. అందుకనే వాడి నోటి మీదుగా విందామని..."

"అంత ముఖ్యమయిన విషయమా?"

"వ్యాపారరీత్యా ప్రముఖమయిన సంగతి కాకపోవచ్చు"

"మరి ఇంకేమిటి?"

"ఏమీ లేదు." అన్నాడు రామనారాయణ, తన మనసులోనే స్పష్టంగా తెలియని విషయాలు బయటకు చెప్పడం – చర్చించడం ఎలాగో అతనికి అర్థం కాలేదు.

జోగులాంబ కాస్సేపటి దాకా ఏం మాట్లాడలేదు.

రామనారాయణ మౌనంగానే ఉండిపోయాడు. అయిదారు నిమిషాలు 'సుదర్శనాష్టకం' చదువుకున్నాడు.

"అబ్బాయి అభిప్రాయం ఏమిటి?" అంది జోగులాంబ.

"వాడికి ఈ వ్యవహారం ఇష్టంగానే ఉంది. భాగస్వామిగా చేరిపోదాం అనుకుంటున్నాడు."

"మీరు... మీరు... మీ అభిప్రాయం ఏమిటి?"

రామనారాయణ మాట్లాడలేదు.

"అబ్బాయి చేరకుండా ఉండటానికి ఏమయినా బలమైన కారణాలు ఉన్నాయా?"

"లేవు."

"మరి ఎందుకింత ఆలోచన?"

"ఏం తోచక"

"కాదు. ఏదో ఉంటుంది. చెప్పండి--"

"ఏమీ లేదు జో" అన్నాడు రామనారాయణ ఆప్యాయంగా. "ఇరవై లక్షలు మనం పెట్టుబడి పెడతాం. అందుకని కాస్త వెనక ముందు ఆలోచించాలి గదా!"

"అన్నీ ఆలోచించుకోండి -- తండ్రీ కొడుకులు. మీకు పనే అదిగా" అంది జోగులాంబ, విషయాన్ని అంతటినీ మరీ 'లైటర్ వెయిన్'కు ఈడుస్తూ. రామనారాయణకు ఈ సాచివేత అంగీకారంగానే ఉంది.

బయట మోటార్ సైకిల్ చప్పుడయింది.

"అబ్బాయి వచ్చినట్లున్నాడు" అన్నాడు రామనారాయణ.

"అవును. అబ్బాయే, మీ దగ్గరకు పంపుతాను" అంటూ జోగులాంబ ముందుకు నడిచింది.

"తొందరేం లేదు. నిదానంగా రానీ"

ఆదినారాయణ మోటార్ సైకిల్ షెడ్‌లో పెట్టి ఇంటిలోనికి నడిచాడు.

"ఇంత ఆలస్యం అయిందేంరా?" అనడిగింది జోగులాంబ.

"ఎంతమ్మా. ఇంకా ఎనిమిదిన్నరయినా కాలేదు" అన్నాడు ఆదినారాయణ దుస్తులు మార్చుకుంటూ.

"మీ నాన్నగారు నీ కోసం ఎదురు చూస్తున్నారు."

"వచ్చేస్తున్నాను, నాన్నా ఓ నిమిషం" అని అరిచాడు ఆదినారాయణ అక్కడినుంచే. "అమ్మా, ముందు నాకు స్నానానికి నీళ్ళు తోడించు. హాయిగా శిరస్నానం చేస్తే గాని ఈ మడ్డి అంతా వదలదు."

"ఈ రోజు కొత్తగా ఏం మడ్డి వచ్చిందిరా?"

"కొత్త మడ్డి కాదమ్మా పాతదే. బాగా గాలి వీచిందిలే."

"ఒళ్ళంతా దుమ్ము దుమ్ము, కనబడడంలా?" అన్నాడు ఆదినారాయణ మళ్ళీ.

జోగులాంబ అతనికి స్నానానికి ఏర్పాటు చేయించింది.

హాయిగా స్నానం చేసి తుండుగుడ్డతో తలంతా తుడుచుకుంటూ తండ్రి

గదిలోకి వెళ్ళాడు ఆదినారాయణ.

"ఏమిటి నాన్నా?"

"ప్రత్యేకంగా ఏం లేదు, అదీ... అదే. ఆ గోపాలరావుగారి అబ్బాయి... ఆ సంగతి ఏం చేశావో తెలుసుకుందామని..."

"ఓహో. అదా. సుందరం ఈ వేళ పొద్దున్నే వచ్చాడు నాన్నా. నువ్వు చెప్పిన కాగితాలన్నీ తీసుకువచ్చాడు. చూపాడు. అన్నీ జాగ్రత్తగా చూశాను"

వాటిలో ఏవో లొసుగులు ఉన్నాయి. అందుచేత ఈ 'ట్రాన్సాక్షన్' వదులుకున్నాను అని ఆదినారాయణ చెబుతాడేమోనని, రామనారాయణ మనసులో సంతోషిస్తున్నాడు. కానయితే ఆదినారాయణ చెప్పింది వేరు.

"అన్నీ సరిగానే ఉన్నాయి."

"మరి... మరి..."

"ఏమిటి నాన్నా?"

"సరేనని చెప్పావా?"

"అంత తొందరేం ఉంది నాన్నా, ఆలోచించి చెబుతానని మరో రెండు రోజులు టైం తీసుకున్నాను."

రామనారాయణ ఏమీ మాట్లాడలేదు.

ఒక నిమిషం అయిన తర్వాత ఆదినారాయణే "అయినా, నీకు అంగీకారం కానప్పుడు-" అని ప్రారంభించాడు.

రామనారాయణ ఒక్క నిమిషం ఆలోచనలో పడ్డాడు. గోపాలరావు కుటుంబం మీద తనకు 'స్పష్టంగా కనబడని అసూయ' ఉన్నదని కొడుకు అనుమానించడం లేదు గద!

"నాకు అంగీకారం లేదని చెప్పానా?" అనడిగాడు చివరకు. ఇలా ఎందుకు అడుగుతున్నాడో అతనికే తెలియదు.

"నీ ధోరణిని బట్టి నేను అలా అనుకున్నాను"

"సరే! అన్ని కాగితాలు క్షుణ్ణంగా చూసిన మీదట, నీకు ఏమనిపించింది?"

"సాలీనా ఎంత తక్కువగా చూసుకున్నా అయిదు లక్షలకు తక్కువ లాభం కళ్ళ చూడనక్కరలేదు. అది మాత్రం గ్యారంటీ."

రెండు నిముషాలు నిశ్శబ్దం.

"ఏ మాత్రం రిస్క్ లేకుండా వస్తుంది. నువ్వెందుకు సంకోచం పెట్టుకుం

టావో నాకు అర్థం కావడంలేదు" అన్నాడు ఆదినారాయణ.

"నాకు సంకోచమా? అదేం లేదు."

"సుందరం నాకు క్లాస్‌మేట్ అని గాని, గోపాలరావుగారు నీకు ఫ్రెండ్ అని గాని చూడడంలేదు. కేవలం వ్యాపార దృష్టి."

రామనారాయణ హృదయం పొగమంచు విడినట్టు అయిపోసాగింది. "నేను ఒక్కటే మాట చెబుతున్నాను. నా అభిప్రాయం ఏమిటి – అని వెదకటానికి ప్రయత్నించకు. నీ మనసుకు ఎలా తోస్తే అలాగేచేయి. నేనేం కాదన్ను. నాకు అదే తృప్తి."

ఆదినారాయణ తండ్రి వంక తెల్లబోయి చూశాడు.

తండ్రి ఈ విషయం ఎందుకింత 'సీరియస్'గా తీసుకుంటున్నాడో, ఇంత స్పష్టంగా తనను ఎందుకు ఒప్పుకోమని చెబుతున్నాడో అతనికి అసలు అర్థం కాలేదు.